క్లుప్తంగా

సన్మానం



ఎస్‌ఐ రమేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్‌ను గ్రామస్తులు శుక్రవారం రాత్రి సన్మానించారు. ఎస్‌ఐ చొరవతో గ్రామం ప్రశాంతంగా ఉందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేదన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రసన్నలక్ష్మి

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలోని దళితవాడలో సర్పంచ్ మొయిద ప్రసన్నలక్ష్మి కొత్తగా బోరును ఏర్పాటు చేసి, శనివారం ప్రారంభించారు. కొన్నాళ్లుగా మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న ఆ కాలనీవాసులు ప్రస్తుతం బోరు వినియోగంలోకి రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొయిద ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట



సంకిలి నాగావళి నదీ తీరంలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని సంకిలి నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు శనివారం అడ్డుకట్ట వేశారు. కొంతమంది యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, ఇసుక రవాణా జరగకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. అక్రమార్కుల ఆగడాలను అడ్డుకుంటున్నామని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు.

200 మందికి రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వంగర: స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లోని విద్యార్థులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం బి.విశాలాక్షి, ఆశ కార్యకర్తలు కలిసి మొత్తం 290 మంది విద్యార్థినుల రక్తనమూనాలు సేకరించి, హెచ్‌బీ(హిమోగ్లోబిన్) పరీక్ష చేశారు. రక్తహీనత తక్కువగా ఉన్న వారిని గుర్తించి, అవసరమైన మందులు అందజేశారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

రాజాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని మారేడుబాక గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన శనివారం పరిశీలించారు. గ్రామంలోని ప్రతీ వీధిలో ఉన్న మురుగుకాలువలను శుభ్రం చేయడంతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలను కూడా బాగుచేయాలని తెలిపారు. ముఖ్యంగా కాలువల్లోని పూడికలు తొలగించాలని, చెత్తను, మురుగును చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలన్నారు.

రాఖీ సందడి

రాజాం సిటీ: పట్టణంలో రాఖీ పండగ సందడి నెలకొంది. ఈ నెల 19వ తేదీన రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని, ఏటా సోదరభావం పెంపొందించేందుకు ప్రతీకగా రాఖీ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అక్కచెల్లెమ్మలు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, ఆశీర్వచనాలు పొందుతారు. తమకు రక్షణగా ఉండాలని కోరుకుంటారు. ఈ నేపథ్యంలో రాఖీల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. రూ.10 నుంచి రూ.300 విలువైన రాఖీలు అందుబాటులో ఉండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు పోటీపడుతున్నారు. తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సైబర్ క్రైమ్, నూతన చట్టాలపై అవగాహన

భోగాపురం: మండల కేంద్రంలోని కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ జూనియర్ కళాశాలతో పాటు ముంజేరు గ్రామంలో ఎస్సై కె.రవికుమార్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంక్ ఖాతా, ఏటీఎం వివరాలు తెలియజేయకూడదన్నారు. అలాగే డ్రగ్స్ సరఫరా, వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



రామభద్రపురం గాంధీబొమ్మ సెంటర్‌లో ప్లకార్డులతో వైద్య సిబ్బంది నిరసన



బాడంగి సీహెచ్‌సీ ఎదుట నినాదాలు చేస్తున్న జూడాలు, సిబ్బంది



తెర్లాం: పెరుమాళిలో ఆందోళన చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్ మౌమితపై జరిగిన లైంగికదాడి, హత్యపై వైద్యులు, సిబ్బంది తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు, ప్రదర్శనలు, మానవహారాలు, రాస్తారోకోలు శనివారం చేపట్టారు. హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సత్వరమే విచారణ పూర్తిచేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. – బొబ్బిలి, రాజాం.



రాజాం సిటీ: మెయిన్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



రాజాం సిటీ: కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు



రాజాం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద వైద్యుల నిరసన



సంతకవిటి: నల్లబ్యాడ్జీలతో సంతకవిటి పీహెచ్‌సీ సిబ్బంది ఆందోళన



బొబ్బిలి సీహెచ్‌సీ వద్ద ఐఎంఏ, వైద్య సిబ్బంది ఆందోళన



బొబ్బిలిలో వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ



బొబ్బిలి రూరల్: పిరిడి పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది నిరసన



బొబ్బిలి గాంధీబొమ్మ సెంటర్‌లో యూటీఎఫ్, ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: స్థానిక కోర్టు ఆవరణలో సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ కోరారు. ఇదే విషయమై కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులు, పోలీసులతో శనివారం సమావేశమైన ఆయన.. రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించనున్నామని తెలిపారు. న్యాయవాదులంతా లోక్‌అదాలత్‌కు సహకరించి, వీలైనన్ని కేసుల పరిష్కారం జరిగేలా చూడాలని సూచించారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌పీబీ కృష్ణసాయితేజ, తహసీల్దారు ఎస్‌కే రాజు, రూరల్ సీఐ ఉపేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, ఉపాధ్యక్షుడు ఆర్‌ఈ సీహెచ్ జయదేవ్, ఏజీపీ ఎస్.పోలారావు, ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటు



సన్యాసినాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: వైఎస్సార్ సీపీ కార్యకర్తల అకాల మరణం పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో సచివాలయ కన్వీనర్ తెర్లి శ్రీనివాసరావు తండ్రి సన్యాసినాయుడు, బాడంగి మండల కేంద్రంలో రాజాన చంద్రశేఖర్ మృతి చెందారు. శనివారం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆయా ప్రాంతాలకు వెళ్లి, మృతదేహాలపై పూలమాలలు ఉంచి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, ప్రతినిధి సురేష్, ఎంపీటీసీ ప్రతినిధి వంగపండు రమేష్, మాజీ ఎంపీటీసీ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

- కోరం లేని కారణంగా కొన్నిచోట్ల వాయిదా



రేగిడి: సోమరాజుపేటలో ఎన్నికైన వారికి ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, మునకలవలస, తునివాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీన జరగాల్సిన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో ఎంపీ ప్రసాదరావు తెలిపారు. సోమరాజుపేట ఎస్‌ఎంసీ చైర్మన్‌గా బూడి కుమారి, వైస్ చైర్మన్‌గా బూడి ఉషారాణి, మునకలవలస పాఠశాల చైర్మన్‌గా లావేటి లక్ష్మి, వైస్ చైర్మన్‌గా పొట్నూరు జ్యోతి, తునివాడ పాఠశాల చైర్మన్‌గా రుంకు సుజాత, వైస్ చైర్మన్‌గా పక్కి గౌరీశ్వరి ఎన్నికైనట్లు ఎంఈవో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కోరం లేని కారణంగా చిన్నశిర్లాం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా వేశామన్నారు.

సంతకవిటి: మండలంలోని గారన్నాయుడుపేట, మిర్తివలస, శేషాద్రిపురం ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కోరం లేని కారణంగా గోవిందపురం, చిత్తారపురం గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎంఈవోలు బి.శాంతకుమారి, సీహెచ్ భాస్కరరావు తెలిపారు.


రాజాం: మండలంలోని సీతంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈవో పేర్కొన్నారు. స్థానిక టీడీపీ నేతలు ఎన్నికను అడ్డుకుంటున్న కారణంగా ఎన్నిక జరగలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వంగర: మండలంలోని శివ్వాం ప్రభుత్వ పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు. కోరం లేని కారణంగా ఎన్నిక నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.

అంబకండిలో 'పొలంబడి'

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగు, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, కూలీల కొరత నివారణ, సేంద్రియ ఎరువుల వినియోగం, ఈ–క్రాప్ నమోదుపై ఏవో మురళీకృష్ణ అవగాహన కల్పించారు. వరి సాగులో అధిక దిగుబడుల కోసం అగ్రికల్చర్ అసిస్టెంట్లు సూచించిన సలహాలు పాటించాలన్నారు. వీలైనంత వరకు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



సీతారాంపురంలో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న సర్పంచ్ తిరుపతినాయుడు

తెర్లాం: మండలంలోని కవిరాయునివలస పంచాయతీ పరిధిలోని సీతారాంపురం, బొంగుపేట, కవిరాయునివలస గ్రామాల్లో దోమల నివారణకు అవసరమైన చర్యలు శనివారం చేపట్టారు. సర్పంచ్ సింగిరెడ్డి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వి.హరి పర్యవేక్షణలో ఆయా గ్రామాల్లోని అన్ని వీధుల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ఖాళీ ప్రదేశాల్లో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం కలిపి చల్లించారు. వర్షాల కారణంగా నీటి నిల్వల్లో పెరిగే దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, ఈ నేపథ్యంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించి, పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరుకావాలని, ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అలాగే గ్రామంలోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వాహనాల పార్కింగ్‌పై ఫిర్యాదు



ఎంపీడీవో కార్యాలయం ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

బొబ్బిలి రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇతరులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంపై ఎంపీడీవో రవికుమార్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్తున్న వారు వారి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి, ఇక్కడి కార్యాలయం ఆవరణలో ఆ వాహనం ఉంచి మళ్లీ సాయంత్రం వారు వచ్చి తీసుకువెళ్తున్నారు. ఇలా కార్లు, వ్యాన్లు, ఆటోలు కూడా నిలిపివేస్తుండడంతో ఉన్నతాధికారుల వాహనాలకు అడ్డుగా ఉంటున్నాయని, ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తుతోందని తెలిపారు. ఇకనుంచి ప్రైవేటు వాహనాలను తమ కార్యాలయంలో నిలిపితే జరిమానా విధిస్తామని ఎంపీడీవో హెచ్చరించారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



ఎమ్మెల్సీ బొత్సకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖపట్నం జిల్లా, స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో పలువురు ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం విశాఖలోనే ఉంటున్న ఎమ్మెల్సీ బొత్సను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం సాయంత్రం కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, భమిడిపాటి విశ్వనాథశర్మ తదితరులు ఉన్నారు.

రాజాం: విశాఖపట్నం స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, ఇతర నేతలంతా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సంతకవిటి వైఎస్సార్ సీపీ కన్వీనర్ గురుగుబెల్లి స్వామినాయుడు, ఎంపీటీసీలు కనకల సన్యాసినాయుడు, వావిలపల్లి వెంకటేశ్వర్లు, సర్పంచ్ బోనెల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇక్కట్లు



రాజాం–రామభద్రపురం రోడ్డులో తెర్లాం జంక్షన్ సమీపంలో నిలిచిన భారీ ట్యాంకర్లు

తెర్లాం: రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో గతకొన్ని రోజులుగా భారీ వాహనాల రాకపోకలు జరుగుతుండడంతో వాహన చోదకులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డులో తెర్లాం జంక్షన్ మీదుగా రామభద్రపురం వైపు, రామభద్రపురం నుంచి రాజాం వైపు భారీ వాహనాలు, ట్యాంకర్లు వస్తున్నాయి. ఈ వాహనాల రాకపోకలతో బస్సులు, కార్లు, ఆటోలు నడిపే వారంతా ఇక్కట్లు పడుతున్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతోందని, అలాగే ఎప్పుడు ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందంటున్నారు. రాత్రి వేళల్లో భారీ వాహనాలు తెర్లాం మీదుగా బొబ్బిలి వైపు ఎక్కువగా వెళ్తుండడంతో రోడ్లు మరమ్మతులకు గురవుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బోధనలోని మెలకువలు నేర్చుకోవాలి

తెర్లాం: ఉపాధ్యాయులంతా పాఠ్యాంశాల బోధనలోని మెలకువలను నేర్చుకోవాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడతాయని, పాఠ్యాంశాల బోధన, తదితర అంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు చర్చించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలని, విద్యార్థులను అన్నివిధాలా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, టీవోటీలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త 'ఉపాధి' పనులు గుర్తించండి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో చేపట్టాల్సిన ఉపాధి హామీ పథకం కొత్త పనులను గుర్తించి, నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో రవికుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్త ఉపాధి హామీ పనులను గుర్తించాలని తెలిపారు. చెరువు పనులతో పాటు వ్యవసాయం, ఉద్యానవనం, తోటల పెంపకానికి అనుసంధానంగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఓడీఎస్ ప్లస్ సర్వేపై ఆరాతీశారు. సమావేశంలో ఏపీవో సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు యు.శంకరరావు మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ వ్యవసాయం చేయాలని, తద్వారా తక్కువ పెట్టుబడి ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతి సేద్యంలో భాగంగా తయారుచేసుకునే నీమాస్త్రం, వేప కషాయం వంటి సేంద్రియ ఎరువులను పంటకు వినియోగిస్తే చీడపీడలు, తెగుళ్లు పంటకు సోకవన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో జీవామృతం తయారీపై ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు అవగాహన కల్పించారు. కిలో బెల్లం, కిలో శనగపిండి, పది లీటర్ల ఆవుమూత్రం తదితర వాటిని ఓ టబ్బులో వేసుకుని మూడు రోజుల పాటు మురగబెడితే జీవామృతం తయారవుతుందన్నారు. ఇలా తయారైన జీవామృతాన్ని వరి పంటపై పిచికారీ చేస్తే ఆ పంటకు సోకే తెగుళ్లను నివారించవచ్చన్నారు.